సాక్షి
విశాఖపట్నం

శనివారం । 3 । జూన్ । 2023




92 మంది రక్తదానం 8లో

బీచ్‌రోడ్డు: తూర్పు నావికదళం ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకులో 92 మంది నేవీ సిబ్బంది రక్తదానం చేశారు.



స్వచ్ఛమైన నీటి సరఫరా లక్ష్యం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడమే జీవీఎంసీ లక్ష్యమని మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. 8లో



సేంద్రియం... ఆరోగ్య సుభిక్షం

గాదిరాజు ప్యాలెస్ వేదికగా రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్గానిక్ మేళా ప్రారంభమైంది. 8లో

న్యూస్‌రీల్

వాతావరణ మార్పులు, విపత్తులపై చర్చ



యూఎస్ కాన్సులేట్ ప్రతిధులతో కమిషనర్

డాబాగార్డెన్స్: యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిశారు. వాతావరణంలో మార్పులు, విపత్తులు, ఎన్ఆర్ఐల రిలేషన్ షిప్‌లపై చర్చించారు. వాతావరణ మార్పులు, విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా ఎదుర్కొవాలి అనే అంశంపై పరస్పర సహకారమందించేందుకు అవసరమైన వనరులపై చర్చించారు. యూఎస్డీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా విశాఖలో చేపడుతున్న కార్యక్రమాలను కమిషనర్ వారికి వివరించారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు స్టీఫెన్ విల్జెర్, అలెగ్జాండ్రా మేయర్, యూఎస్డీపీ కాన్సులేట్ శ్రీనివాస్ రాజామని పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్

డాబాగార్డెన్స్: టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 8 ఫిర్యాదులు అందాయి. చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్న ఓపెన్ ఫోరంలో జోన్-3 నుంచి రెండు, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి నాలుగు, జోన్-6 నుంచి ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు, ఇతర ఫిర్యాదులకు జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేయాలన్నారు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫోన్ నంబరు 81878 97569కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపాచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపీలు నరేంద్రరెడ్డి, వసంతకుమార్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న చినజీయర్ స్వామి



భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినేపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి పాల్గొన్నారు. ముందుగా ఆయన చేతులమీదుగా ఐశ్వర్య లక్ష్మి అమ్మ వారికి లక్ష్మి హవనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొనడంతోపాటు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కే.ఎస్.ఎన్.మూర్తి, కే.భానోజీరావు, కే.శ్రీనివాసరావు, కే.చంద్రశేఖరరావు, వీ.తాతాజీ, ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

నేడు తాగునీటికి అంతరాయం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వేణు గోపాల్ శుక్రవారం పేర్కొన్నారు. జీవీఎంసీ టీఎస్సార్ ప్రాంగణంలో గల స్టోరేజ్ రిజర్వాయర్ శుభ్రపరుస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. జోన్-4 పరిధి 28 నుంచి 39 వార్డుల్లో వెలంపేట, టౌన్ కొత్తరోడ్డు, మెయిన్ రోడ్డు, రంగిరీజువీధి డౌన్, మంతావారి వీధి, సున్నపు వీధి, రెల్లివీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్ల కోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మరవీధి, కొబ్బరితోట, నేతాజీనగర్, అంబేడ్కర్ కాలనీ, జెండా చెట్టు డౌన్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, దండుబజార్, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబాగార్డెన్స్ ప్రధాన రహదారి, జగదాంబ జంక్షన్ రోడ్డు, నీలమ్మ వేపచెట్టు పరిధి, పలు ప్రాంతాలకు ఇది వర్తిస్తుందన్నారు. అత్యవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు పర్యవేక్షక ఇంజినీర్ తెలిపారు.

మీ ఇల్లే.. ఇక సినిమా థియేటర్!



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి, నిర్మాత సి.కల్యాణ్, నటుడు జోగినాయుడు తదితరులు

- ఫ్యామిలీతో కలిసి మొదటి రోజు మొదటి ఆట చూసే అవకాశం
- దేశంలో తొలిసారిగా ప్రారంభించిన ఏపీ ప్రభుత్వం
- ఏపీ ఫైబర్ నెట్ ద్వారా రిలీజ్ సినిమా
- రూ.99 టికెట్‌తో 24 గంటల పాటు ఎన్నిసార్లైనా చూసే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : అరెరె.. మంచి సినిమా రిలీజైంది. ఏ థియేటర్‌లోనూ టికెట్స్ దొరకడం లేదు.. ఫ్యామిలీతో సినిమా ప్లాన్ చేశాను. కానీ నా ప్లాన్ అంతా ఫ్లాప్ అయిందే.. ఈ అనుభవం సినిమా అభిమానులందరికీ చాలాసార్లు ఎదురయ్యే ఉంటుంది. ఇకపై మీ ప్లాన్లు ఫ్లాప్ అవ్వవు.

ఎందుకంటే.. ఫ్యామిలీ మొత్తం.. ఒకే టికెట్‌పై రిలీజ్ సినిమాని ఇంటి నుంచే ఎంచక్కా చూసెయ్యవచ్చు. అదీ 99 రూపాయలకే... అది కూడా 24 గంటల సేపు.. ఆ సినిమాని ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు చూడొచ్చు కూడా..నిజమండీ.. రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ డే.. ఫస్ట్ షో పేరిట ఈ అవకాశం కల్పిస్తోంది. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఏంటీ.. ఫస్ట్ డే ఫస్ట్ షో..?

కోవిడ్ తర్వాత సినీ పరిశ్రమ కుదేలైంది. థియేటర్లకు వెళ్లేందుకు జనం భయపడేవారు. క్రమంగా పరిస్థితులు చక్కబడ్డాయి. థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ఓటీటీ ప్లాట్‌ఫారాలు కూడా అదే రీతిలో దూసుకొచ్చాయి. ఓటీటీల కోసమే కొన్ని సినిమాలు తీస్తూ థియేటర్లో కాకుండా ఈ ప్లాట్‌ఫారాలు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఓటీటీ హవా నడుస్తోంది. ప్రజలు థియేటర్‌కు వెళ్లే కంటే ఇంట్లోనే సినిమా చూసేందుకు మొగ్గు చూపుతున్నారు. అందుకే ఇదే బాటలో ఫైబర్ నెట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటీటీలకు భిన్నంగా ఫస్ట్ డే ఫస్ట్ షోను విశాఖ వేదికగా శుక్రవారం ప్రారంభించింది. ఓటీటీ ప్లాట్‌ఫారంలో రిలీజ్ అయిన సినిమాలు థియేటర్‌లో కనిపించవు. కానీ ఫస్ట్ డే ఫస్ట్ షోలో మాత్రం.. థియేటర్‌లోనూ, ఇటు ఇంట్లోనూ ఒకేసారి రిలీజ్ అవుతాయి. సినీ ప్రముఖులతో చర్చలు జరిపి ఈ సేవలను ప్రభుత్వం ప్రారంభించింది.



ఎలా చూడగలరు..? ఎవరు చూడగలరు..

ఇందుకోసం.. ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉండాలి. రూ.199 నుంచి ఈ కనెక్షన్ అందుబాటులో ఉంది. కొత్త సినిమాని ఫైబర్ నెట్‌లో రిలీజ్ చెయ్యాలని ప్రభుత్వంతో నిర్మాతలు ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. ఆ సినిమా ఎప్పుడు విడుదలవుతుందన్నది ముందుగానే ప్రకటిస్తారు. సినిమా చూడాలనుకున్న వినియోగదారులు.. రూ.99తో ఏపీఎస్ఎఫ్ఎల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. ఆ సినిమా లింక్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకున్న వినియోగదారుడికి పంపిస్తారు. ఒకే టికెట్‌తో ఇంటిల్లిపాదీ రిలీజ్ సినిమాను ఫస్ట్ డే రోజున.. ఫస్ట్ షో ఇంట్లోనే చూసుకోవచ్చు. ఈ లింక్ 24 గంటల పాటు యాక్టివేట్‌గా ఉంటుంది. అంటే.. 24 గంటల సమయంలో ఎన్నిసార్లు అయినా ఈ సినిమా చూసుకోవచ్చు.

నిర్మాతలకు లాభమేనా..

తెలుగులో ఏటా వందకుపైగా సినిమాలు విడుదలవుతున్నాయి. ఒక పెద్ద హీరో సినిమా లేదా.. పెద్ద బ్యానర్ సినిమా రిలీజ్ అయితే, చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం కష్టంగా మారింది. థియేటర్లు ఖాళీ అయ్యేంత వరకూ చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవు. ఈ సమయంలో థియేటర్లకు వెళ్లి సినిమా చూడలేని వారికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త సినిమాలు చూసేందుకు తీసుకొచ్చిందే ఫస్ట్ డే ఫస్ట్ షో కాన్సెప్ట్. ఏపీ ఫైబర్ నెట్ తీసుకొచ్చిన ఈ కాన్సెప్ట్ ద్వారా చిన్న సినిమా నిర్మాతలకు ఊతంలా ఉంటుంది. నిర్మాతలకు ప్రమోషనల్ ఖర్చులు తగ్గుతాయి. ఇందులో వచ్చే ఆదాయాన్ని ఫైబర్ నెట్, నిర్మాతలు పంచుకుంటారు. ఉదాహరణకు రాష్ట్రంలోని 660 మండలాల్లోని 950 ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్ వినియోగదారులు 8 లక్షల మంది ఉన్నారు. వీరిలో కనీసం లక్షల మంది ఫస్ట్ డే ఫస్ట్ షో సినిమా చూసేందుకు సబ్‌స్క్రైబ్ చేసుకుంటే.. దాదాపు రూ.కోటి వస్తుంది. ఈ మొత్తాన్ని ఫైబర్ నెట్, నిర్మాతలు షేర్ చేసుకుంటారు. తద్వారా చిన్న సినిమా నిర్మాతలు కూడా లాభపడి మరిన్ని విభిన్నమైన సినిమాలు వచ్చే అవకాశాలున్నాయి.

తొలి సినిమా నిరీక్షణ : ఫస్ట్ డే.. ఫస్ట్ షో కాన్సెప్ట్ ద్వారా ప్రజల ఇంటికి చేరువైన తొలి సినిమా నిరీక్షణ.. టేక్ ఓకే క్రియేషన్స్ బ్యానర్‌పై ఉత్తరాంధ్రకు చెందిన వంశీకృష్ణ దర్శకత్వంలో సాయిరోనక్ హీరోగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది.

8న విశాఖకు అమిత్‌షా

- మోదీ తొమ్మిదేళ్ల పాలనపై భారీ సభ
- ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్న బీజేపీ శ్రేణులు
- విశాఖకు షా రాక ఇది రెండోసారి



సాక్షి, విశాఖపట్నం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈనెల 8న విశాఖకు వస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ శ్రేణులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా విశాఖలోనూ అలాంటి సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం లేదా రైల్వే గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఆ పార్టీ నాయకులు యోచిస్తున్నారు. అమిత్ షా సభకు బూత్‌కు కనీసం పది మంది చొప్పున 1936 బూత్‌ల నుంచి 20 వేల మందికి పైగా జనాన్ని, కార్యకర్తలను సమీకరించాలని భావిస్తున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు శనివారం బీజేపీ కోర్ కమిటీ నేతలు సమావేశమవుతున్నారు. కాగా అమిత్ షా విశాఖకు రానుండడం ఇది రెండోసారి. గత సాధారణ ఎన్నికల్లో ఆయన ఎన్ఏడీ నుంచి కంచరపాలెం వరకు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. అమిత్ షా పాల్గొనే బహిరంగ సభ సమయం ఇంకా ఖరారు కాలేదని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం జరగనున్న గ్రూప్-1 రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ తెలిపారు. నగరంలో ఆంధ్రాయూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ, ఎకనామిక్స్, కామర్స్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ఈ పరీక్ష సుమారు 1300 అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే చర్యలు

- కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్, కలెక్టర్ మల్లికార్జున, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్‌కు వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యులను కలెక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై కేజీహెచ్ అభివృద్ధికి సంబంధించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా పలు విభాగాధిపతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విభాగాధిపతులు తమకు కావాల్సిన మౌలిక వసతులు, మెడికల్ సామగ్రి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించి, పూర్తి చేసిన పనుల వివరాలు తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో 15 పనులకు సుమరు రూ.1.10 కోట్లు, వైద్య పరికరాల నిమిత్తం రూ.కోటి వరకు కలెక్టర్ మల్లికార్జున ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులు చాలా నిరుపేదలని, అత్యవసర సమయాలలో సాధ్యమైనంతగా మంచి వైద్యం అందించి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బి.ఎ.నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషా, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జూలై 2వ తేదీన జరిగే గిరి ప్రదక్షిణ, 3న జరిగే ఆలయ ప్రదక్షిణ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. గిరి ప్రదక్షిణ, ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సెక్షన్ విభాగాల అధికారులతో ఈవో ముందస్తు సమీక్ష శుక్రవారం సింహగిరిపై నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వివిధ అంశాలపై అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో చర్చించారు. ముఖ్యంగా ఆరోజు 32కిలోమీటర్ల మేర భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న స్టాల్స్, పుష్పరథం, ఆలయానికి పుష్పాలంకరణ, మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఉచిత ప్రసాద వితరణ, అన్నప్రాసాద భవనంలో భక్తులకు భోజనం, సింహగిరిపై క్యూలైన్లు ఏర్పాటు, తొలిపావంచా వద్ద ఏర్పాట్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రధాన పురోహితులు శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, పిల్లా జగన్‌మోహన్ పాత్రుడు, శ్రీదేవి వర్మ, సాయు నిర్మల, ముందుడి రాజేశ్వరి, బయ్యవరపు రాధ, దశమంతుల రామలక్ష్మి, దొడ్డి రమణ, దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు, నాగేశ్వరరావు, హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావు, జంగం శ్రీనివాస్, నరసింహరాజు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

పర్యావరణహిత విశాఖ లక్ష్యం

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకుకు కృషి
- 5న ఎకో-వైజాగ్ పేరిట బీచ్ రోడ్డులో ప్రత్యేక కార్యక్రమం
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో దేశంలోని 4,355 నగరాల్లో జీవీఎంసీ 4వ స్థానం సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ ఏడాది మరింత మెరుగైన ర్యాంకు సాధించేందుకు నగర ప్రజల తోడ్పాటు అవసరమని చెప్పారు. పర్యావరణ దినోత్సవం రోజున(ఈ నెల 5న) సాయంత్రం సాగర తీరాన ఈకో-వైజాగ్ పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్టు తెలిపారు. భావితరాల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన ఐదు అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమం కొనసాగనుందన్నారు. పరిశుభ్రత-ఆరోగ్యం, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణ, పచ్చదనం పెంపు, నీటి పొదుపు కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ఐదు అంశాలకు సంబంధించి 10 ఎన్‌ఫోర్స్‌మెంట్ వెహికల్స్‌ను ఈ నెల 5న బీచ్‌రోడ్డులో నిర్వహించనున్న ఎకో-వైజాగ్ కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ వాహనాల ద్వారా సిబ్బంది నగరంలో అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపడతారన్నారు. ఈ అంశాల దీర్ఘకాలిక అమలుకు 'ఈకో-ఫండ్'ను కూడా ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో గుర్తింపు తెచ్చుకోండి



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో మేయర్ హరివెంకట కుమారి, అధికారులు

డాబాగార్డెన్స్: విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కారుణ్య నియామక పత్రాలు శుక్రవారం అందుకున్న అభ్యర్థులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచించారు. విధుల్లో ఉంటూ మరణించిన 13 మంది ఉద్యోగుల పిల్లలకు ఆమె కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఇషితా గంగూలి త్రిపాఠి

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఆటోనగర్‌లోని చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రంలోని ఎంఎస్ఎంఈ శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఢిల్లీ నుంచి విచ్చేసిన కేంద్ర ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ ఇషితా గంగూలి త్రిపాఠి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వాసీవా) భవనంలో ఇండస్ట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రెడిట్ ప్రొక్యూర్‌మెంట్, ఎంఎస్ఎంఈ పాలసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. యూనిట్ పెర్‌ఫార్మెన్స్ బట్టి సబ్సిడీ ఇవ్వాలన్నారు. సీజీటీఎంసీ అనుకున్నంత రీతిలో సాగడం లేదని, టార్గెట్ ఇవ్వాలని కోరారు. మహిళలకు ఎంఎస్ఎంఈ పార్క్‌లు ఏర్పాటు చేయాలని, చిన్న పరిశ్రమలకు వలంటీర్‌గా ఈఎస్ఐ, ఈపీఎఫ్ వర్తింప చేయకుండా చూడాలన్నారు. ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు శాశ్వతంగా స్థలం కేటాయించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి త్రిపాఠి హామీ ఇచ్చారు. అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్(హైదరాబాద్) డి.చంద్రశేఖర్ ఎంఎస్ఎంఈలకు కేంద్ర ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలపై, ఎంఎస్ఎంఈ డిప్యూటీ డైరెక్టర్(న్యూఢిల్లీ) ఓ.పి.సింగ్ పారిశ్రామికవేత్తలకు బ్యాంక్‌లు కల్పిస్తున్న రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజి, కార్యదర్శి డి.వినోద్, ఉపాధ్యక్షుడు ఈ.కృష్ణ ప్రసాద్, కోశాధికారి బి.ఎస్.రావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఆటోనగర్ ఎంఎస్ఎంఈ ఏడీలు, పలు బ్యాంక్‌ల ప్రతినిధులు, అనకాపల్లి, విశాఖ జిల్లా డీఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఎండల్లో మంచు హాయ్



పచ్చని మొక్కలు.. పొగమంచుతో ఆహ్లాదకరంగా బీచ్‌రోడ్డు

డాబాగార్డెన్స్: నగరంలో చిత్రమైన దృశ్యం ఆవిష్కృతమైంది. కొన్ని రోజులుగా ఎండలు మండుతున్న వేళ.. శుక్రవారం ఉదయం మంచు కురిసి ఆహ్లాదం పంచింది. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి అటూ.. ఇటుగా పొగమంచు కమ్మేసింది. దీంతో ఎదురెదురు వాహనాలు కనిపించలేదు. బీచ్‌రోడ్డులో వాకింగ్ చేసే వాకర్స్ ఈ వాతావరణాన్ని ఆస్వాదించారు. పచ్చని మొక్కలు.. నిండు పొగమంచుతో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కనువిందుగా కనిపించింది. బీచ్ అందాలు ద్విగుణీకృతమయ్యాయి.

సాంఘిక సంక్షేమశాఖ డీడీగా రామారావు



ఎంవీపీకాలనీ : జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. కొంతకాలంగా జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పోస్టు ఖాళీగా ఉంది. ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా (జేడీ) ఉన్న రమణమూర్తి ఈ విభాగ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రామారావును డీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా రామారావు పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించనున్నారు.

ఉత్తర భారత సందర్శనకు ప్రత్యేక రైలు

IRCTC

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి ఉత్తర భారతదేశంలోని పలు ఆలయాలు, దర్శనీయ స్థలాలు సందర్శించుకోవాలనే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీ ప్రకటించింది. ప్రయాణికులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా.. అనుభవజ్ఞులైన గైడ్‌లతో ఈ టూర్‌ను డిజైన్ చేసింది. ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా శుక్రవారం ఈ టూర్ వివరాలు వెల్లడించారు. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్(మాతా వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేష్‌తో కలిపి) యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుంది. ఈ యాత్ర ఈ నెల 10న ప్రారంభమై 18వ తేదీన ముగుస్తుంది. ఈ యాత్రలో పాల్గొనాలనుకునే వారు మాత్రం సికింద్రాబాద్ లేదా కాజీపేట చేరుకోవాల్సి ఉంటుంది. తాజ్‌మహల్, కృష్ణ జన్మభూమి, బృందావన్‌లోని ప్రేమ్ మందిర్, బాంకే బిహారీ మందిర్, కత్రాలోని మాతా వైష్ణోదేవి టెంపుల్, హరిద్వార్‌లోని మానస దేవి, హర్ కి పౌరి, రిషికేష్‌లోని లక్ష్మణ్ ఝూలా, రామ్ ఝూలా తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి టికెట్, వసతి, స్థానిక రవాణా ఛార్జీలతో కలిపి ఎకానమీ రూ.15,435, స్టాండర్డ్ రూ.24,735, కంఫర్ట్ రూ.32,480గా ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఎకానమీ ప్రయాణికులకు నాన్ ఏసీ గదులు, స్టాండర్డ్, కంఫర్ట్ ప్రయాణికులకు ఏసీ గదుల్లో షేరింగ్ పద్ధతిలో వసతి కల్పిస్తారు. మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో లేదా చందన్‌కుమార్(82879 32318), విశాలాక్షి(9701085461)ను సంప్రదించాలని చంద్రమోహన్ కోరారు.

నేడు తెలుగమ్మాయి గ్రాండ్ ఫైనల్స్

బీచ్‌రోడ్డు: లలితా జ్యువెలర్స్ తెలుగమ్మాయి గ్రాండ్ ఫైనల్స్ శనివారం నిర్వహించనున్నట్లు ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ తెలిపారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగే ఈ పోటీల్లో 20 మంది వివాహితులు, 13 మంది యువతులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

సేంద్రియం... ఆరోగ్య సుభిక్షం

- వినియోగదారులను ఆకట్టుకున్న ఆర్గానిక్ మేళా



ఎంవీపీకాలనీ: గాదిరాజు ప్యాలెస్ వేదికగా రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్గానిక్ మేళా ప్రారంభమైంది. 60 స్టాళ్ల ద్వారా ఇక్కడ సేంద్రియ ఉత్పత్తులను ప్రదర్శించారు. సేంద్రియ పంటలు, వంట పదార్థాలు, నూనెలు, ఔషధాలు, విత్తనాలు, గృహోపకరణాలు వంటి ఎన్నో సహజ సిద్ధ ఉత్పత్తులు సందర్శకులను ఆకర్షించాయి. పలు సంస్థలు మిల్లెట్స్, డ్రైఫ్రూట్స్‌ను విక్రయించారు. ఈ మేళా మూడు రోజుల పాటు కొనసాగుతుందని సంస్థ మార్కెటింగ్ విభాగం స్టేట్ లీడ్ బి.ప్రభాకర్ తెలిపారు.

కొబ్బరి ఉత్పత్తుల ప్రదర్శన



అనకాపల్లి జిల్లా నామవరానికి చెందిన సాంబమూర్తి అన్నపూర్ణేశ్వరి వేద వ్యవసాయ క్షేత్రం ద్వారా ఉత్పత్తి చేస్తున్న సహజ పంటలను ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రత్యేక ప్లాంట్ ద్వారా తయారు చేసిన కొబ్బరి ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనలో ఉంచినట్లు సాంబమూర్తి వివరించారు. కొబ్బరికాయను తొలిచి దాని లోపలి గుజ్జుతో కలిసి కొబ్బరి వాటర్‌ను మార్కెటింగ్ చేస్తున్నట్లు స్టాల్ నిర్వాహకులు తెలిపారు. తాటి బెల్లం, పసుపు, వంద రకాల రైస్ ఉత్పత్తులు, గోధుమలు, మినుములు వంటి సహజ సిద్ధంగా పండించిన ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

మొక్కల పరిరక్షణకు పంచగవ్య



సాయికృష్ణ గోశాల ప్రకృతి ఉత్పత్తుల కేంద్రం ఆధ్వర్యంలో మొక్కల పరిరక్షణ కోసం ప్రత్యేక ఉత్పత్తులను విక్రయించడం అందరినీ ఆకర్షించింది. పంచగవ్య ద్రావకాన్ని వీరు విక్రయిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన ఈ ద్రావకం అన్ని రకాల మొక్కల ఎదుగుదలకు దోహదం చేస్తుంది. పంచగవ్య లీటర్ రూ.200. దీంతో పాటు అగ్ని అస్త్రం, దశపర్ణి, బ్రహ్మాస్త్రం, వర్మీ కంపోస్ట్, వేప కషాయం, ఎగ్ అమినో యాసిడ్ వంటివి విక్రయిస్తున్నారు.

సహజ పంటల సృజనాస్

సృజనాస్ ఆర్గానిక్ స్టాల్‌లో అందుబాటులో ఉంచిన ఉత్పతులపై వినియోగదారులు ఆసక్తి కనబరిచారు. పలువురు సభ్యులతో కలిసి ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. నేచురల్ ఫార్మింగ్, టెర్రస్ గార్డెన్, విత్తనాల ఉత్పత్తికి ఈ సంస్థ కృషి చేస్తోంది. మిల్లెట్స్, మిల్లెట్ స్నాక్స్, తేనె, ఆయుర్వేదిక నూనెలు, రాక్ సాల్ట్, డ్రై ఫ్రూట్స్, నట్స్, బ్రౌన్ రైస్ వంటి ఉత్పత్తులను విక్రయిస్తోంది. సొంతంగా పండించిన ఉత్పత్తులతో పాటు ఆయా రైతులకు చెందిన ఆహార పదార్థాలను వీరు మార్కెటింగ్ చేస్తున్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న వినియోగదారులు

219 రకాల చిరుధాన్యాలు అందిస్తున్నాం



ఆర్గానిక్ మేళాలు రైతులను ప్రోత్సహించడానికి దోహదపడతాయి. ధింసా నేచురల్ ఫార్మింగ్ ప్రొడక్ట్స్ ఆర్గనైజేషన్ ద్వారా 219 రకాల చిరు ధాన్యాలు, పప్పు దినుసుల విత్తనాలు అభివృద్ధి చేసి రైతులకు అందిస్తున్నాం. ఉత్తరాంధ్రలో 15 వేల మంది రైతులు మా విత్తనాల ద్వారా పంటలు వేస్తున్నారు. మరో 15 వేల మంది రైతులకు వీటిని అందించాలన్నదే మా లక్ష్యం. – పచారి దేముళ్లు, రైతు సాధికారత సంస్థ స్టేట్ రిసోర్స్ పర్సన్(మిల్లెట్స్)

అన్యాయంగా ఇరికించారనే కక్షగట్టాడు

- కొన్నాళ్లుగా క్రాంతి, శ్యామ్‌పై రగిలిపోతున్న ఎర్రయ్య
- కాకినాడలో జరిగిన ఫంక్షన్‌లో హత్యకు పథక రచన?

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదర్శనగర్‌లో గురువారం జరిగిన రౌడీషీటర్ క్రాంతి హత్య కేసులో పలు విషయాలు బయటకొస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 17న అదే ప్రాంతంలో జరిగిన అనిల్ హత్య కేసులో క్రాంతి కొడుకు శ్యామ్ ఏ1గా, ప్రస్తుతం క్రాంతిని హతమార్చినట్లు భావిస్తున్న ఎర్రయ్య ఏ3గా ఉన్న విషయం తెలిసిందే. అయితే అనిల్ హత్య కేసులో తన ప్రమేయం లేకున్న క్రాంతి, అతని కొడుకు శ్యామ్ తనని అన్యాయంగా ఇరికించారంటూ కొంతకాలంగా ఎర్రయ్య రగిలిపోతున్నాడు. దీంతో పాటు తనకు బెయిల్ ఇప్పించకపోవడం, తర్వాత పట్టించుకోకపోవడంతో అతనికి ఆగ్రహం తెప్పించింది. కాగా.. కాకినాడలోని అనిల్ ఇంట్లో గురువారం జరిగిన ఫంక్షన్‌కు ఎర్రయ్య కుటుంబంతో కలిసి హాజరయ్యాడు. అక్కడ అనిల్ హత్య విషయం ప్రస్తావనకు రావడంతో పాటు కొందరు ఈ కేసులో నిన్ను అన్యాయంగా ఇరికించారంటూ ఎర్రయ్యను రెచ్చగొట్టినట్లు తెలిసింది. దీంతో తండ్రీకొడుకులు క్రాంతి, శ్యామ్‌లపై కసి తీర్చుకోవాలని ఎర్రయ్య నిర్ణయించుకున్నాడు. గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్న ఆయన నేరుగా ఆదర్శనగర్ వచ్చాడు. ఎర్రయ్య, అతని తండ్రి కలిసి అనుపమ బార్ సమీపంలో ఉండగా.. క్రాంతి అక్కడకు మద్యం సేవించేందుకు వచ్చాడు. ఈ క్రమంలో ఎర్రయ్య.. కాంత్రిని సెల్‌తో వీడియో తీయడంతో అతను ప్రశ్నించాడు. దీంతో వారిద్దరి మధ్య అనిల్ హత్య ఘటన జరిగిన చోట వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఎర్రయ్య తనతో తెచ్చుకున్న కత్తితో క్రాంతిని విచక్షణా రహితంగా పొడిచి హతమార్చినట్లు తెలిసింది. ఈ హఠాత్ పరిణామంతో ఎర్రయ్య తండ్రి అక్కడి నుంచి పరారు కాగా.. నిందితుడు పోలీసుల వద్ద లొంగిపోయినట్లు సమాచారం. అయితే ఈ అంశానికి సంబంధించి ఎంవీపీ పోలీసులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

అంతర్జాతీయ కార్మిక సదస్సుకు 'మళ్ల'



మళ్ల జగదీశ్వరరావు

మహారాణిపేట: జెనీవాలో ఈ నెల 4 నుంచి 16వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ కార్మిక సమ్మేళనంలో రాష్ట్రం నుంచి విశాఖకు చెందిన అఖిల భారత సంస్థ(బీఎంఎస్) ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు పాల్గొంటున్నారు. ఈ మేరకు భారతదేశ కార్మిక శాఖ నుంచి ఆయనకు ఆహ్వాన పత్రిక అందించింది. సుమారుగా 191 దేశాల నుంచి కార్మిక మంత్రులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. 2017లో ఐఎల్‌వో సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావును పలువురు అభినందించారు.

పలు రైళ్లు రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా విశాఖపట్నం నుంచి, విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేశారు. మరికొన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న విశాఖపట్నం-రాయ్‌పూర్(08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దయింది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 3న విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ విశాఖలో గంట ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 3న అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అమృత్‌సర్‌లో 5 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న సికింద్రాబాద్-భువనేశ్వర్(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న చెన్నై సెంట్రల్-హౌరా (12840) మెయిల్ చెన్నై సెంట్రల్‌లో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న వాస్కోడగామా-షాలిమార్ (18048) అమరావతి ఎక్స్‌ప్రెస్ వాస్కోడగామాలో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

గమ్యం కుదించిన రైళ్లు

- విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5 నుంచి 12 వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం- కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్- విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఈ నెల 4న రామేశ్వరం-భువనేశ్వర్ (20895), బెంగళూరు-భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు మార్గమధ్యలో 45 నిమిషాలు, 30 నిమిషాలు నిలిపివేస్తారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం?

మల్కాపురం: సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికులను కలచివేసింది. వివరాలివీ.. బాపట్ల జిల్లా ఇంకులు మండలానికి చెందిన వంకదారి వీరాంజనేయులు(34) 2009లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరాడు. 2021లో హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థకు బదిలీపై వచ్చి.. అప్పటి నుంచి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. మల్కాపురం సమీపంలోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్‌లో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా..శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. గదిలోకి నిద్రించడానికి వెళ్లాడని భార్య భావించింది. సాయంత్రం టీ తాగేందుకు అతన్ని నిద్రలేపే ప్రయత్నంలో గది తలుపు కొట్టింది. ఎంతకీ స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి పక్క క్వార్టర్స్‌లో ఉన్న వారిని పిలిచింది. వారు కిటికీ తెరిచి చూడగా ఫ్యాన్‌కు వీరాంజనేయులు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని మల్కాపురం పోలీసులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఆర్థిక ఇబ్బందులే కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్వచ్ఛమైన నీటి సరఫరా లక్ష్యం

- మేయర్ హరి వెంకటకుమారి



ట్యాంకుల పనితీరు తెలుసుకుంటున్న మేయర్

దాబాగార్డెన్స్: నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడమే జీవీఎంసీ లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని తాగునీటి ట్యాంకులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ టెలీ కాన్ఫరెన్స్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో నగర ప్రజల నుంచి తాగునీటి సరఫరా విభాగంపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా రంగు మారిన, దుర్వాసన కూడిన నీరు సరఫరా అవుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మంచి నీటి ట్యాంకులను పరిశీలించామన్నారు. ప్రతి ట్యాంకును శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరుస్తున్న దృష్ట్యా శుక్ర, శనివారాల్లో జోన్-3, 4, 5 పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్, సహాయ ఇంజినీర్ విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

ఆనందపురం: గండిగుండం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. వివరాలివీ.. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు సమీపంలోని చినబాబు కాలనీకి చెందిన అయినవిల్లి వికాస్(19) దాకమర్రి వద్ద గల రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మొదట సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే తోటి స్నేహితులతో కలిసి ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కాగా.. శనివారం తమ దగ్గర బంధువుల వివాహం ఉండడంతో ఇంటికి వస్తానని వికాస్.. తన తండ్రి నాగేశ్వరరావుకు ఫోన్ చేసి అడగ్గా సమ్మతించాడు. తాడేపల్లిగూడెంలో వ్యాపారులకు సరఫరా చేయడానికి విజయనగరంలో ఓ వ్యాపారి వద్ద తెలగపిండి కొనుగోలు చేసి బొలెరోలో లోడు చేసి ఉందని.. అక్కడకు వెళ్లి ఆ వ్యాన్‌లో అనకాపల్లికి రావాలని వికాస్‌కు తండ్రి సూచించాడు. ఈ మేరకు వికాస్ విజయనగరం వెళ్లి బొలెరోలో బయలుదేరాడు. ఆ వ్యాన్ అనకాపల్లి వైపు వెళ్తుండగా గండిగుండం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్ కేబిన్‌లో కూర్చున్న వికాస్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్ తిలక్ కుమార్ ఎడమ కాలు విరిగి పోయింది. డ్రైవర్ తిలక్‌ను ఆనందపురం పోలీసులు ఆస్పత్రిలో చేర్పించి.. వికాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెవెన్యూ సిబ్బందిపై ఆక్రమణదారుల దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు



రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న ఆక్రమణదారు కుటుంబ సభ్యులు

ఆరిలోవ: తోటగరువులో ఆక్రమణను అడ్డుకోవడానికి వెళ్లిన రూరల్ రెవెన్యూ సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేశారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ తహసీల్దార్ ఎస్.రమణయ్య తెలిపిన వివరాలివీ.. తోటగరువులోని సర్వే నంబర్ 55 కొండవాలులో సుమారు 200 చదరపు గజాల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి చదును చేశాడు. అందులో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న ఆర్.ఐ ప్రవీణ్‌కుమార్, సచివాలయాల వీఆర్వోలు మౌనిక, యువరాజు, సిబ్బందితో కలసి శుక్రవారం నిర్మాణం పనులను అడ్డుకున్నారు. గోడలు తొలగిస్తుండగా ఆక్రమణదారుడి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని రెవెన్యూ సిబ్బందిపై దాడి చేశారు. మొల్లి హేమంతకుమార్ అనే వ్యక్తి వీఆర్వో యువరాజుపై చేయిచేసుకున్నాడు. దీంతో హేమంతకుమార్‌పై వీఆర్వో ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆక్రమించడం తప్పయితే దాన్ని తొలగించానికి వెళ్లిన సిబ్బందిపై దాడి చేయడం పెద్ద నేరమని తహసీల్దార్ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక దృఢత్వం ముఖ్యం

- అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: పోలీసులు మానసిక దృఢత్వం కలిగి ఉండాలని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. విశాలాక్షినగర్‌లోని ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ మైదానంలో జరుగుతున్న పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులతో మాట్లాడి రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునశ్చరణ తరగతులు పోలీసుల్లో క్రమశిక్షణ కలిగిస్తాయన్నారు. బందోబస్తు సమయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆందోళన జరిగిన చోట పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ 117వ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి వాల్తేర్ డివిజన్‌లో డీఆర్‌యూసీసీ సభ్యుల పాత్రను అభినందించారు. పలువురు సభ్యులు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. పరిశుభ్రత, ఎస్కలేటర్లు, లిఫ్ట్, రిటైరింగ్ రూం, రైళ్ల పెంపుదల, పాదచారుల వంతెన, తదితర అంశాలపై చర్చించారు. సభ్యులు తెలిపిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని డీఆర్ఎం హామీ ఇచ్చారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ 2 ప్రీతిరాణా, డీఆర్‌యూసీసీ సభ్యులు యర్రం వెంకటరెడ్డి, నెక్కంటి భాస్కరరావు, తాడేల ఉమా వెంకట మహేశ్వరరావు, మనోజ్‌కుమార్ ఆచార్య, కొప్పిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.